వర్షబీభత్సం

కుమరి, నీలగిరి సహా 6 జిల్లాల్లో నిండుకుండల్లా డ్యామ్‌లు, జలపాతాలు

కూలిన చెట్లు, విరిగిపడిన మట్టిపెళ్లలు ● వైగై నదిలో పోటెత్తిన వరద



తిరపరుప్పు జలపాతంలో పరవళ్లు తొక్కుతున్న ప్రవాహం

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల తీవ్రత, పడమటి కనుమల్లో పెనుగాలుల కారణంగా కన్నియాకుమారి, నీలగిరి సహా ఆరు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో జలాశయాల్లో నీటిమట్టం పెరిగింది. కొన్ని జలాశయాల్లో నీటిమట్టం ప్రమాద స్థితికి చేరటంతో అదనపు జలాలను విడుదల చేస్తున్నారు. దీనితో ఆయా జలాశయాల దిగువ ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత నాలుగు రోజులుగా చెదురుమదురుగా కురిసిన వర్షాలు బుధవారం నుంచి కుండపోతగా మారాయి. కన్నియాకుమారి జిల్లాలో రోజంతా కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండ ప్రాంతాలకు చేరువగా ఉన్న కుట్రియారు, మోదిమలై, తచ్చమలైలో కుండపోత వర్షాలు కురిశాయి. కాలికేశం వద్ద అడవి వెల్లువ ఉధృతంగా ప్రవహించడంతో ఓ టెంపో వ్యాన్ మునిగింది. ఆ వ్యాన్‌లో వున్న కార్మికులను అటవీశాఖ అధికారులు కాపాడి ఒడ్డుకు చేర్చారు. పేచ్చిపార్రై, పెరుంజాని డ్యామ్ ప్రాంతాల వద్ద కూడా భారీ వర్షాలు కురిశాయి. వర్షాలకు తిరపరుప్పు జలపాతం వద్ద వరద నెలకొంది. ఆ జలపాతం దగ్గరకు పర్యాటకులు వెళ్ళకుండా అధికారులు కట్టుదిట్టం చేశారు.



జలకళను సంతరించుకున్న పాపనాశం డ్యామ్



నీలగిరి జిల్లా గూడలూరు వద్ద కూలిపడిన చెట్టు

భవానీవాగులో వరద దృశ్యాలు...

కోయంబత్తూరు జిల్లాలోని బిల్లూరు డ్యామ్ నుంచి గురువారం ఉదయం జలాలను విడుదల చేయడంతో భవానీవాగులో వరద పరిస్థితి నెలకొంది. దీంతో ఆ వాగుకు సమీపంలో పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నీలగిరి జిల్లా సరిహద్దులో ఉన్న కేరళలో కురిసిన వర్షాలకు బిల్లూరు డ్యామ్ నీటి మట్టం పూర్తిస్థాయిలో 100 అడుగులకు చేరింది. నాలుగు చెక్‌డ్యామ్‌ల ద్వారా సుమారు 14 వేల ఘనపుటడుగుల చొప్పున విడుదల చేస్తున్నారు. దీంతో భవానీ వాగు పొంగి ప్రవహిస్తోంది. ఆ వాగు సమీపంలోని ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరినీ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మేట్టుపాళయం మున్సిపల్ అధికారులు భవానీ వాగు సమీపంలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని దండోరావేసి హెచ్చరిస్తున్నారు. ఇదే విధంగా సోలయారు డ్యామ్‌లోను నీటిమట్టం పెరిగింది. ఒకే రోజు 20 అడుగుల మేర నీటిమట్టం పెరగటంతో అదనపు జలాలను విడుదల చేస్తున్నారు.

నీలగిరిలో...

నైరుతి రుతుపవనాల ప్రభావంతో నీలగిరి జిల్లా గూడలూరు, పందలూరు, నడువట్టమ్, దేవర్‌సోలై, నాడుకాని తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. గూడలూరు పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షాలకు తరచూ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అంతేకాకుండా ప్రధాన రహదారులలో 16చోట్ల చెట్లు కూలిపడటంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అగ్నిమాపక సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్ళి చెట్లను తొలగించారు. ఈ వర్షాలకు పలుచోట్ల మట్టి పెళ్లలు విరిగి పడటంతో కొన్ని ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఆమైకుళం ప్రాంతంలో విజయకుమార్ అనే వ్యక్తి దుకాణంపై మట్టిపెళ్లలు విరిగిపడటంతో పూర్తిగా ధ్వసంమైనంది. తోరవాయల్, ఎరివయల్ తదితర పల్లపు ప్రాంతాల్లోని ఐదిళ్ల జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పందలూరు కురిసిన భారీ వర్షాలకు సేరంబాడి వద కార్మికుడు మునియప్పన్‌కు చెందిన ఇంటిపై మట్టిపెళ్లలు విరిగిపడగా ఆ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.

తేని జిల్లాలో...

ముల్లై పెరియార్ డ్యామ్ నీటి పరివాహక ప్రాంతమైన ఇడుక్కి జిల్లాలో గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు డ్యామ్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండురోజులుగా కురిసిన కుండపోత వర్షాలకు డ్యామ్ నీటిమట్టం ఒకే సారి నాలుగు అడుగులకు పెరిగింది. ఆ డ్యామ్ నుండి అదనపు జలాలను విడుదల చేస్తుండటంతో లోయర్ క్యాంప్ విద్యుదుత్పత్తి కేంద్రంలో మూడు జనరేటర్లతో 102 మెగావాట్ల విద్యుత్ ఉత్పతి చేస్తున్నారు. ముల్లైపెరియార్ డ్యామ్ నుండి జలాలను విడుదల చేయడంతో వైగై డ్యామ్ నీటిమట్టం 48.29 అడుగులకు పెరిగింది. ఇక మేఘమలై అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా కురిసిన కుండపోత వర్షాలకు చిన్నసురుళి జలపాతం వద్ద నీటి ప్రవాహం పఎెరగడంతో పర్యాటకులు వెళ్లకుండా పోలీసులు కాపలా కాస్తున్నారు.

తిరునల్వేలిలో...

తిరునల్వేలి జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురవటంతో జలాశయాల్లో నీటి మట్టం పెరిగింది. బుధవారం రాత్రి చెదురుమదురు వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాపనాశం డ్యామ్‌లో నీటి మట్టం పెరిగింది. ఇదే విధంగా నెడుముడియారు జలాశయం ప్రమాద స్థాయికి చేరింది.

తెన్‌కాశి జిల్లాలో...

తెన్‌కాశి జిల్లాలో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. కడనా డ్యామ్ నీటిమట్టం 53 నుంచి 57 అడుగులకు పెరిగింది. రామనది డ్యామ్ లోనూ నీటిమట్టం 72 అడుగుల నుండి 74 అడుగులకు చేరింది. జిల్లాలోనే అతిపెద్ద జలాశయమైన అడవి నయినార్ డ్యామ్ నీటమట్టం గురువారం ఉదయానికల్లా 85 అడుగులకు చేరింది. నీటిమట్టం పెరగటంతో రైతులు హర్షం ప్రకటిస్తున్నారు.

హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం

తిరుచ్చిలో అంతర్జాతీయ హంగులతో గ్రంథాలయం ● అసెంబ్లీలో వెల్లడించిన సీఎం స్టాలిన్



సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను కలిసిన రైతు సంఘాల నేతలు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించనున్నామని, అదేవిధంగా తిరుచ్చిలో అంతర్జాతీయ సదుపాయలతో దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధి పేరుతో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆయన గురువారం సభలో 110వ నిబంధన ఒక ప్రకటన చేశారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడివుందన్నారు. ముఖ్యంగా అన్ని ప్రాంతాలను పారిశ్రామికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో ద్రావిడ పాలన ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలోని అన్ని శాఖలు పురోగతిలో ఉన్నాయని, వీటిలో ప్రధానంగా పారిశ్రామిక రంగం ఎంతగానో వృద్ధి సాధించిందని గుర్తు చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి అనేకమంది పెట్టుబడిదారులు, బడా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, కంపెనీలు నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఫలితంగా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. 2022లో ఎగుమతి రంగంలో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. కొత్త పరిశ్రమల స్థాపన రాష్ట్రాల జాబితాలో 2020లో చివరి స్థానంలో ఉన్న రాష్ట్రం ఇపుడు మొదటి స్థానాన్ని ఆక్రమించిందన్నారు. 2030 నాటికి రాష్ట్ర ఆర్థిక స్థితి ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకునేందుకు వీలుగా మౌలిక సదుపాయాల రూపకల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా, హోసూరుతో పాటు కృష్ణగిరి, ధర్మపురి, సమీప జిల్లాలకు ఉపయోగపడేలా ఒక విమానాశ్రయాన్ని నిర్మిస్తామన్నారు. అదేవిధంగా తిరుచ్చిలో కలైంజర్ కరుణానిధి పేరుతో ఒక గ్రంథాలయాన్ని నిర్మిస్తామన్నారు. కొట్టూరుపురంలో ఎనిమిదంతస్తుల్లో ఒకే సమయంలో 1200 మంది కూర్చొనేలా అంతర్జాతీయ సౌకర్యాలతో లైబ్రరీని నిర్మించామని గుర్తు చేశారు. ఇదే విధంగా ఇతర ప్రాంతాల వాసులకు కూడా ఉపయోగపడేలా గ్రంథాలయాలను నిర్మిస్తామన్నారు. మదురైలో కూడా గత యేడాది జూన్ నెల 15న ఒక గ్రంథాలయాన్ని ప్రారంభించినట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ సభలో వెల్లడించారు.

స్టాలిన్‌కు రైతు సంఘాల నేతల ధన్యవాదాలు

అడయార్, జూన్ 27: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను గురువారం సచివాలయంలో పలు రైతు సంఘాల నేతలు కలుసుకుని ధన్యవాదాలు తెలిపారు. ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు ఖరీఫ్ సీజన్‌లో సాధారణ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.105, సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.130 అదనంగా ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనికి ధన్యవాదాలు తెలుపుతూ పలు రైతు సంఘాల నేతలు సీఎం స్టాలిన్‌ను కలుసుకుని, ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను సీఎం స్టాలిన్ వారికి వివరించారు.

కళ్లకుర్చి వెళ్ళటానికి భయమెందుకు?

● స్టాలిన్‌ను నిలదీసిన ఈపీఎస్
● సీబీఐ విచారణ కోరుతూ అన్నాడీఎంకే దీక్ష
● నల్లచొక్కాలతో పాల్గొన్న ఎమ్మెల్యేలు



ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద చేపట్టిన నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఈపీఎస్, పాల్గొన్న అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కార్యకర్తలు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కళ్ళకుర్చిలో కల్తీసారా తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ భయపడుతున్నారని, అందుకే ఆయన ఆ దుర్ఘటనపై సభలో సమగ్రంగా చర్చించేందుకు కూడా జంకుతున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. కళ్లకుర్చి కల్తీసార దుర్ఘటనపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ, ఈ విషయమై అసెంబ్లీలో ప్రసంగించేందుకు అనుమతించని పాలకపక్షంపై నిరసన వ్యక్తం చేస్తూ అన్నాడీఎంకే శాసనసభ్యులు నిరాహార దీక్ష చేపట్టారు. ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద గురువారం ఉదయం జరిగిన ఈ ఆందోళనలో ఈపీఎస్ సహా పార్టీ నేతలంతా నల్ల చొక్కాలు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ కళ్లకుర్చిలో కల్తీసారా దుర్ఘటన జరిగిన వారం దాటినా, బాధితులను పరామర్శించేందుకు స్టాలిన్ ఎందుకు వెళ్లలేదో సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సభ్యులను గెంటివేయడంతోపాటు సస్పెండ్ చేయడం అన్యాయమని, ప్రతిపక్షం గొంతు నులిమివేయడానికే ప్రయత్నిస్తున్నారని ఈపీఎస్ ధ్వజమెత్తారు.

నేడు గవర్నర్‌తో డీఎండీకే నేతల భేటీ...: ఈ నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించిన డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత అన్నాడీఎంకే ఎమ్మెల్యేల దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై శుక్రవారం గవర్నర్ ఆర్ఎన్ రవిని తాను, తమ పార్టీ ప్రతినిధులు కలుసుకుని వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ దీక్షలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్, మాజీ మంత్రులు కేపీ మునుసామి, దిండుగల్ శీనివాసన్, ఎస్పీ వేలుమణి, సెంగోటయ్యన్, ఆర్బీ ఉదయకుమార్, సెల్లూరు కే రాజు, కడంబూరు రాజు, డి.జయకుమార్, దళవాయి సుందరం, నత్తం విశ్వనాథన్, తంగమణి, వలర్మతి, గోకుల ఇందిర సహా పార్టీ ప్రముఖులు రాయపురం మనో. నిర్మలా పెరియసామి, జిల్లా శాఖ కార్యదర్శులు బాలగంగా, ఆదిరాజారమ్, వీఎన్ రవి, వెంకటేష్ బాబు, టి.నగర్ సత్యా, రాజేష్, అశోక్, కేపీ కందన్, మాధవరం మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి వాలాజాబాద్ గణేషన్, పార్టీకి చెందిన వివిధ విభాగాల నేతలు ఈసీ శేఖర్, కాట్పాడి రాము, ఎన్ఎం, ఇమ్మానువేల్, ముగప్పేర్ ఇలంజెళియన్, ఏఎం కామరాజ్, వేళచ్చేరి మూర్తి, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాలకు చెందిన పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు సుమారు రెండు వేలమంది నిరాహార దీక్షలో పాల్గొన్నారు. నిరాహార దీక్ష ప్రాంతం వద్ద పోలీసు ఉన్నతాధికారులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

క్రికెట్‌లో ధోనీ... రాజకీయాల్లో స్టాలిన్

● మెరుగైన ఫలితాల్లో వారికి వారే సాటి
● ఒలింపిక్స్‌లో పాల్గొనే రాష్ట్ర క్రీడాకారులకు ప్రోత్సాహక నిధి పెంపు
● అసెంబ్లీలో మంత్రి ఉదయనిధి



శాసనసభలో తన శాఖ పద్దు ప్రవేశ పెట్టే సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న మంత్రి ఉదయనిధి

పెరంబూర్, జూన్ 27: రాజకీయాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ తన రికార్డుల్ని తనే అధిగమిస్తున్నారని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి, ప్రత్యేక పథకాల అమలు శాఖ మంత్రి మంత్రి ఉదయనిధి కొనియాడారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం మంత్రి ఉదయనిధి మాట్లాడుతూ.. క్రీడారంగంలో కొందరి పేర్లు మాత్రమే చరిత్రలో నిలిచిపోతాయన్నారు. పరుగు పందెంలో హుస్సేన్ బోల్ట్, క్రికెట్ అంటే మహేంద్ర సింగ్ ధోని రికార్డుల్ని అధిగమించే సత్తా వారికే చెల్లిందన్నారు. అలాగే రాజకీయాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతి ఎన్నికల్లోనూ గతంలో వాటి కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఇటీవల ముగిసిన పార్లమెంటు ఎన్నికల్లో 40కి 40 స్థానాలు సాధించి డీఎంకే కూటమి ఛాంపియన్ షిప్ చేజిక్కించుకుందని ప్రశంసించారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా వారికి ప్రోత్సాహక వేతనం అందిస్తున్నామన్నారు. డీఎంకే అధికారం చేపట్టిన మూడేళ్లలో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులకు ప్రోత్సాహక నిధిగా రూ.102 కోట్లు అందించామని తెలిపారు. ఈ ఏడాది ప్యారీస్‌లో జరుగునున్న పోటీలకు 16 మంది పాల్గొంటున్నారని, ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు అందించే ప్రోత్సాహక వేతనం రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచుతున్నామని ప్రకటించారు. అలాగే, క్రీడాకారులకు 'కలైంజర్ స్పోర్ట్స్ కిట్' అందించనున్నామన్నారు. ముఖ్యమంత్రి ట్రోఫీ లో మరిన్ని క్రీడల్ని చేర్చనున్నామని తెలిపారు. కోయంబత్తూర్‌లో అంతర్జాతీయ క్రికెట్ మైదానం నిర్మాణపనులు త్వరలో చేపట్టనున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు ఏర్పాటుపై పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

మరో 1.48 లక్షల మందికి 'మహిళా ప్రోత్సాహక నిధి'...

రాష్ట్రంలో మళ్లీ దరఖాస్తు చేసుకున్న 1.48 లక్షల మంది మహిళలకు రూ.1,000 ప్రోత్సాహక నిధి అందజేయనున్నట్లు శాసనసభలో మంత్రి ఉదయనిధి ప్రకటించారు. శాసనసభలో గురువారం ప్రత్యేక పథకాల నిర్వహణ శాఖ పద్దులపై చర్చ సందర్భంగా మంత్రి ఉదయనిధి మాట్లాడుతూ.. కలైంజర్ మహిళా ప్రోత్సాహక నిధి పథకంలో 1.15 కోట్ల మంది మహిళలకు నెలనెలా రూ.1,000 అందిస్తున్నామన్నారు. గతంలో దరఖాస్తు చేసుకొని ఈ పథకానికి ఎంపిక కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిందని, ఆ ప్రకారం, మళ్లీ దరఖాస్తు చేసుకున్న వారిలో 1.48 లక్షల మందిని అర్హులుగా గుర్తించామన్నారు. దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు 30 రోజుల్లో ఈ-సేవా కేంద్రాల ద్వారా మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు.

సమాచార దర్శిని

నేటితో ముగియనున్న బీవీఎస్సీ దరఖాస్తు స్వీకరణ

ఐసిఎఫ్, జూన్ 27: తమిళనాడు వెటర్నరీ సైన్స్ విశ్వ విద్యాలయంలో బీవీఎస్సీ (ఏహెచ్), బీటెక్ కోర్సులకు దరఖాస్తుల గడువు శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. ప్రవాస భారతీయులు జూలై 5వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 2 నుంచి 4వ తేది వరకు దరఖాస్తులో సవరణ చేయవచ్చు. ఇతర వివరాలకు https://adm.tanuvas.ac.in అనే వెబ్‌సైట్ చూడవచ్చు.

యూత్ జస్టిస్ గ్రూప్‌లో ఉపాధి

ఐసిఎఫ్, జూన్ 27: జిల్లా యూత్ జస్టిస్ గ్రూపులో భర్తీకాని పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. ప్లస్ టూ ఉత్తీర్ణులై, తమిళం, ఇంగ్లీషు టైప్ రైటింగ్‌లో హయ్యర్ పాసై 40 ఏళ్లలోపున్న వారు https://chennai.nic.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

200 సీట్లతో ఆడిటోరియం

ఐసిఎఫ్, జూన్ 27: స్థానిక చెట్‌పెట్‌లోని సహకార కార్యాలయంలో 200 సీట్లతో ఆడిటోరియం ఏర్పాటు చేశారు. రాష్ట్ర సహకార యూనియన్ కార్యాలయంలో రూ.48 లక్షలతో 200 సీట్ల సామర్థ్యంతో కరుణానిధి సెంటినరీ శతస్మారక ఆడిటోరియం నిర్మాణపనులు ఇటీవల పూర్తవగా బుధవారం ఈ ఆడిటోరియాన్ని సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్ ప్రారంభించారు.

రూ.200 కోట్లతో 2,500 ట్రాన్స్‌ఫార్మర్లు

ఐసిఎఫ్, జూన్ 27: అదనపు విద్యుత్ సరఫరా కోసం రూ.200 కోట్లతో 2,500 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ... తిరుప్పూర్ జిల్లా కొంగల్ నగర్, తిరుచ్చి తంగనగర్‌లో రూ.211 కోట్లతో ఉప విద్యుత్ కేంద్రం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. చెన్నై, కాంచీపురంలలో రూ.217 కోట్లతో 19 పవర్ డీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేస్తామన్నారు. 2,500ప్రాంతాల్లో అదనపు విద్యుత్ సరఫరా కోసం రూ.200కోట్లతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయనున్నామని మంత్రి తెలిపారు.

రిజిస్ట్రేషన్ శాఖలో 'స్టార్ 3.0' సాఫ్ట్‌వేర్

ఐసిఎఫ్, జూన్ 27: 'స్టార్ 3.0' సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది. ఆస్తుల విక్రయ పత్రాల రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్‌లోకి మార్చేందుకు స్టార్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను 2018లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆచరణరీత్యా వీటిలో వివిధ మార్పులు అవసరమవుతున్నట్లు స్టార్ 3.0 అనే కొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించాలని నిర్ణయించినట్లు రిజిస్ట్రేషన్ అధికారులు తెలిపారు. ఈ సాఫ్ట్‌వేర్ తయారీకి రూ.323.45 కోట్లు వినియోగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. త్వరలో టెండర్లు విడుదల చేస్తామన్నారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

పెరంబూర్, జూన్ 27: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06012 నాగర్‌కోయిల్-తాంబరం వారాంతపు రైలు సేవలు జూలై 7 నుంచి 21వ తేది (ప్రతి ఆదివారం) వరకు, నెం.06011 తాంబరం-నాగర్‌కోయిల్ జూలై 8 నుంచి 22వ తేది (సోమవారం) వరకు పొడిగించారు. అలాగే, నెం.06035 తాంబరం-కొచ్చువెల్లి (గురు, శుక్రవారం) ప్రత్యేక రైలు జూలై 4 నుంచి 20వ తేది వరకు, మరుమార్గంలో 06036 కొచ్చువెల్లి-తాంబరం (శుక్ర, ఆదివారాలు) ప్రత్యేక రైలు సేవలు జూలై 5 నుంచి 21వ తేది వరకు పొడిగించారు.

కలైమామణిలకు ఉచిత ప్రయాణం

ఐసిఎఫ్, జూన్ 27: 'కలైమామణి' పురస్కారగ్రహీతలు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారు. అసెంబ్లీలో మంత్రి స్వామినాధన్ మాట్లాడుతూ... మదురైలో కొత్త ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కళాశాలను రూ.4.79 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. కలైమామణి పురస్కారం పొందిన 60 ఏళ్లు పైబడ్డ కళాకారులు, వారి వెంట వచ్చే ఒకరు ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతించినట్లు మంత్రి తెలిపారు.

56 టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ల దరఖాస్తుల తిరస్కరణ

ఐసిఎఫ్, జూన్ 27: నకిలీ సమాచారంతో గుర్తింపు కోరిన 56 టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ల దరఖాస్తులను సాంకేతిక విద్య డైరెక్టరేట్ నిరాకరించింది. రాష్ట్రవ్యాప్తంగా 2 వేలకు పైగా టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్లలో సుమారు 2 లక్షల మంది శిక్షణ పొంది పరీక్షలు రాస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ పోస్టులకు టైప్ రైటింగ్ షార్ట్‌హ్యాండ్ అవసరమవుతుండడంతో విద్యార్థులు ఎక్కువగా ఈ ఇన్‌స్టిట్యూట్లలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కొత్త శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు నిబంధనలతో కూడిన అనుమతులను సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఇస్తోంది. ఈ నేపథ్యంలో, 500లకు పైగా టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్నాయి. వాటిని పరిశీలించిన అధికారులు, 56 దరఖాస్తులను నిరాకరించారు.

ఇసుక క్వారీల్లో మూడేళ్లుగా అక్రమాలు

- పరిమితికి మించి 30 రెట్ల తవ్వకాలు
- ప్రభుత్వ ఖజానాకు రూ.4730 కోట్ల నష్టం
- డీజీపీకి ఈడీ లేఖ

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత మూడేళ్లుగా ఇసుక క్వారీలలో భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయని, పరిమితికి మించి 30 రెట్లు తవ్వకాలు జరిపి, ఇసుక దోపిడీకి పాల్పడి ప్రభుత్వ ఖజానాకు రూ.4730 కోట్ల మేర నష్టం కలిగించారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్‌కు లేఖ రాశారు. గత యేడాది ఏప్రిల్ లో ఐదు జిల్లాల్లోని ఇసుక క్వారీలు, గోదాముల్లో తాము చేపట్టిన తనిఖీల్లో 23.60 లక్షల యూనిట్ల మేర ఇసుక దోపిడీ జరిగినట్లు వెల్లడైనట్లు తెలిపారు. ఈ అక్రమాలకు సంబంధించి ఐదు జిల్లాల కలెక్టర్లకు సమన్లు పంపి వారిని కూడా విచారించినట్లు పేర్కొన్నారు. ఇసుక క్వారీలో విచ్చలవిడిగా జరిగిన అక్రమాలను నిరోధించేందుకు చట్టపరమైన చర్యలు చేపట్టలేదని కూడా ఈడీ అధికారులు ఆ లేఖలో ఆరోపణలు చేశారు.



ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో గురువారం మర్యాదపూర్వకంగా బేటీ అయిన మాజీ గవర్నర్ తమిళసై సౌందర్ రాజన్

విక్రవాండిలో ఏ పార్టీకి మద్దతు లేదు

- డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



ఈపీఎస్‌కు సంఘీభావం తెలుపుతున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, జూన్ 27: విక్రవాండి శాసనసభ ఉప ఎన్నికల్లో తాము ఏ పార్టీకి మద్దతివ్వడం లేదని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత స్పష్టం చేశారు. జూలై 10న జరుగనున్న విక్రవాండి ఉప ఎన్నికల్లో డీఎంకే, పీఎంకే, నామ్ తమిళర్ పార్టీ సహా స్వతంత్రులు మొత్తం 29 మంది పోటీచేస్తున్నారు. ఈ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రతిపక్ష అన్నాడీఎంకే ఇదివరకే ప్రకటించింది. ఈ నేపథ్యంలో, గత పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో పోటీచేసిన డీఎండీకే కూడా విక్రవాండి ఉప ఎన్నికల్లో పోటీచేయడం లేదని ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత విడుదల చేసిన ప్రకటనలో... గతంలో ఈరోడ్ ఉప ఎన్నికల్లో కూడా అధికార బలంతో డీఎంకే విజయం సాధించిందని, విక్రవాండి ఉప ఎన్నికల్లోనూ అదే ఫార్ములాతో వారు బరిలో నిలిచారన్నారు. అందువల్ల ఈ ఎన్నికల్లో పోటీచేయని తాము, ఏ పార్టీకి మద్దతివ్వడం లేదని స్పష్టం చేశారు. శాసనసభ నుంచి అన్నాడీఎంకే సభ్యులను సస్పెండ్ చేయడం దారుణమని, వారి సస్పెండ్‌కు సరైన కారణం తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శాసనసభలో ప్రజల సమస్యలు లేవనెత్తే ప్రతిపక్షాల గొంతులు నొక్కేలా అధికార పార్టీ వ్యవహరిస్తోందని ప్రేమలత ఆరోపించారు. ఇదిలా ఉండగా రాజరత్తినం స్టేడియం వద్ద గురువారం ఉదయం అన్నాడీఎంకే చేపట్టిన దీక్షలో డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పాల్గొన్నారు.

మంత్రి ముత్తుస్వామి రాజీనామా చేయాలి

కళ్లకుర్చి ఘటనకు బాధ్యత వహిస్తూ మంత్రి ముత్తుస్వామి రాజీనామా చేయాలని ప్రేమలత డిమాండ్ చేశారు. కళ్లకుర్చి కల్తీ సారా ఘటనలో 67 మంది మృతిచెందిన ఘటన రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసిందన్నారు. రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి కళ్లకుర్చి ఘటనకు నిదర్శనంగా ఉందన్నారు. కల్తీ సారా విక్రయాలు రాజకీయ నేతలు, పోలీసుల అండదండలతో సాగుతున్నాయని విమర్శించారు. కళ్లకుర్చి ఘటనపై సీబీఐ విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగుచూసే అవకాశముందన్నారు. కళ్లకుర్చి ఘటనపై సీబీఐ విచారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ త్వరలో గవర్నర్ ఆర్ఎన్.రవిని సంప్రదించి వినతిపత్రం అందజేయనున్నట్లు ప్రేమలత తెలిపారు.

ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో వివాహితులకు ఉద్యోగాలివ్వరా?

- రాష్ట్ర ప్రభుత్వం నివేదిక కోరిన కేంద్రం

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరులో ఐఫోన్ విడిభాగాలను తయారు చేసే ఫాక్స్‌కాన్ కర్మాగారంలో వివాహితులకు ఉపాధి అవకాశాలను నిరాకరిస్తున్నారనే ఆరోపణలపై నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఇటీవల ఆ సంస్థలో కొన్ని ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన చూసి దరఖాస్తు చేసిన ఇద్దరు వివాహిత మహిళలు ఇంటర్వ్యూకు వెళ్లారు. ఆ సమయంలో ఆ కర్మాగారం ప్రధాన ద్వారం వద్ద ఉన్న అధికారులు ఆ మహిళలను అడ్డుకుని వారికి వివాహమైందా అని ప్రశ్నించారు. తమకు వివాహమైనట్లు ఆ ఇద్దరు మహిళలు చెప్పడంతో తమ ఫ్యాక్టరీలో పెళ్ళయిన మహిళలకు ఉద్యోగాలిచ్చేదిలేదంటూ వెనక్కి పంపించారు. ఆఇద్దరు వివాహితులకు ఫాక్స్‌కాన్ కర్మాగారంవద్ద జరిగిన చేదుఅనుభవం గురించి ప్రసారమాధ్యమాల్లో వార్తలుగా వెలువడ్డాయి. సుప్రసిద్ధ వార్తా సంస్థ రాయిటర్స్ కూడా ఆ వార్తను ప్రధాన శీర్షికలో వెలువరిచింది. భారత దేశంలో వివాహిత మహిళలకు ప్రముఖ ఫ్యాక్టరీలు ఉద్యోగాలివ్వడం లేదంటూ ఆ వార్తా సంస్థలు విమర్శల వర్షం కురిపించాయి. ఈ విషయం పై స్పందించిన కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖల మంత్రిత్వ శాఖ ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో వివాహిత మహిళలకు ఉద్యోగావకాశాలను నిరాకరిస్తున్న విషయంపై విచారణ జరిపి సమగ్రమైన నివేదికను పంపమంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వు జారీ చేసింది. ప్రాంతీయ కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్ కూడా విచారణ జరిపి వీలయినంత త్వరగా నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించింది. వివాహితులను పనులలోకి చేర్చుకుంటే కుటుంబ బాధ్యతల కారణంగా తరచూ సెలవులు పెడతారనే కారణంగానే ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీ నిర్వాహకులు వారికి ఉద్యోగవకాశాలు నిరాకరిస్తున్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో తమ ఫ్యాక్టరీలో వివాహితులకు ఉద్యోగాలు నిరాకరించడం లేదని ఫాక్స్‌కాన్ సంస్థ ప్రసారమాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలను ఖండించింది.

బస్సులు కూడా కొనుగోలు చేయలేదు
అంతలో విమానాశ్రయమా...?

- అన్నామలై ఎద్దేవా



పెరంబూర్, జూన్ 27: రెండేళ్లలో బస్సులు కూడా కొనని డీఎంకే, ప్రస్తుతం విమానాశ్రయం ఏర్పాటుచేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఎద్దేవా చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుచేస్తామని శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారన్నారు. 2022 ఏప్రిల్ 4వ తేది డీఎంకే ఎంపీ విల్సన్, హోసూరు విమానాశ్రయం గురించి అడిగిన ప్రశ్నకు రాష్ట్రప్రభుత్వం, డీఏఏల్ సంస్థతో ఒప్పందం చేసుకొని, హోసూరు విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు చేపట్టవచ్చని అప్పటి కేంద్ర విమానాయాన శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ బదులిచ్చారన్నారు. రెండేళ్లు గడిచిపోయాయి. ప్రస్తుతం హోసూరు అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుచేస్తామని సీఎం ప్రకటించారని తెలిపారు. 2022లో 110వ నిబంధనల కింద 7,200 కొత్త తరగతి గదులు, 16,390 కి.మీ రహదారుల అభివృద్ధి, 1,000 కొత్త బస్సులు, 500 ఎలక్ట్రికల్ బస్సులు తదితర ప్రకటనలు రెండేళ్లుగా అటకెక్కాయని విమర్శించారు. ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చకుండా, మూడేళ్లలో కేవలం ప్రకటనలకే పరిమితమైన ముఖ్యమంత్రి ఆచరణకు సాధ్యం కాని మరో హామీ ప్రకటిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నామలై విమర్శించారు.

సముద్రంలో విండ్ మిల్లుల కోసం నిధులు

ఐసిఎఫ్, జూన్ 27: తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలను ఆనుకొని సముద్రంలో చెరో 500 మెగావాట్ల సామర్థ్యంతో విండ్ మిల్లుల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం రూ.7,453 కోట్లు కేటాయించింది. దేశవ్యాప్తంగా భూమిపై విండ్ మిల్ ఏర్పాటుచేస్తున్న విషయం తెలిసిందే. తొలివిడతగా 500 మెగావాట్ల సామర్థ్యంతో రెండు చోట్ల ఏర్పాటుచేయనున్నారు.

గ్రంథాలుగా శిలాఫలకాలు

ఐసిఎఫ్, జూన్ 27: శిలాఫలకాలు గ్రంథ రూపంలో మార్చేందుకు రూ.3.50 కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ... మదురై తిరుమల నాయకర్ అంతఃపురంలో రూ.2.80కోట్లతో విద్యుద్దీపాలతో శిల్ప ప్రదర్శనశాల ఏర్పాటుచేయనున్నామన్నారు. రామనాథపురం జిల్లాలో బయల్పడిన పురాతన వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న శిలాశాసనాలు చదివి గ్రంథాలుగా రచించేందుకు రూ.3.50 కోట్లతో ప్రణాళిక రూపొందించామని మంత్రి తెలిపారు.

కుట్రాలం జలపాతాలకు పర్యాటకుల అనుమతి

పెరంబూర్, జూన్ 27: తెన్‌కాశి జిల్లా కుట్రాలంలోని ప్రధాన జలపాతం, ఐందరువి సహా అన్ని జలపాతాలకు పర్యాటకులను అనుమతిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటన విడుదల చేసింది. కొద్దిరోజులుగా జిల్లాలోని పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కుట్రాలం జలపాతాల వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉంది. పర్యాటకుల భద్రత దృష్ట్యా సోమవారం నుంచి జలపాతాల వద్ద పర్యాటకులు స్నానాలకు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో, జలపాతాల వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో కుట్రాలంలోని అన్ని జలపాతాలకు పర్యాటకులను అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీలంక జైళ్లలోని తమిళ జాలర్ల విడుదలకు చర్యలు

- సీఎంకు కేంద్ర మంత్రి లేఖ

పెరంబూర్, జూన్ 27: శ్రీలంక జైళ్లలో ఉన్న జాలర్లను విడుదల చేసేలా రాయబార కార్యాలయం ద్వారా చర్యలు చేపట్టినట్లు కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు. అరెస్టయిన జాలర్లను విడుదల చేసేందుకు శ్రీలంక ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాం, జాలర్ల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతిస్తోందని కేంద్ర మంత్రి లేఖలో పేర్కొన్నారు. కాగా, శ్రీలంక అరెస్ట్ చేసిన జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే.

21 సార్లు జైలుకెళ్ళిన వ్యక్తి కల్తీసారా వ్యాపారం

- కళ్లెదుటే సారా అమ్ముతున్నా పట్టించుకోని పోలీసులు
- త్వరలో జాతీయ మహిళా కమిషన్‌కు నివేదిక
- ఖుష్బూ ప్రకటన

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కళ్లకుర్చిలో యేళ్లతరబడి పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో బహిరంగంగా కల్తీసారా విక్రయిస్తున్నా పోలీసులు పట్టించుకోలేదని, 21 సార్లు జైలుకు వెళ్ళిన నేరస్థుడే కల్తీసారా విక్రయించాడని, ఈ దుర్ఘటనలో 44 మంది మహిళలు భర్తలను కోల్పోయి వితంతువులుగా మారారని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, ప్రముఖ నటి ఖుష్బూ ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లకుర్చి కల్తీసారా దుర్ఘటనపై రెండు రోజుల పాటు విచారణ జరిపిన ఖుష్బూ మీడియాతో మాట్లాడుతూ.. కల్తీసారా విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని కళ్ళకుర్చి వాసులంతా పలుమార్లు పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారని, వాటికి సంబంధించిన ఆధారాలు లేవని తమ విచారణ సందర్భంగా పోలీసు అధికారులు చేతులెత్తేశారన్నారు. తన విచారణలో 160 మంది కల్తీసారా తాగారని, వారిలో 63 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. కల్తీసారాకు బలైన 12 మంది కుటుంబాలను తాను విచారించానని తెలిపారు. కల్తీసారా విక్రయించి అరెస్టయిన వ్యక్తి 21 సార్లు అదే నేరానికి పాల్పడి జైలుకెళ్లాడని, ఇప్పుడు కూడా ఆ వ్యక్తి బెయిలుపై దర్జాగా తిరుగుతున్నాడని చెప్పారు. ఈ నెల 18 నుంచి కళ్ళకుర్చిలో కల్తీసారా దుర్ఘటనకు సంబంధించి నమోదు చేసిన కేసుల వివరాలు తమ వద్దలేవని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్న సీబీసీఐడీకి అన్ని దస్తావేజులను సమర్పించినట్లు చెప్పారని, వాటి నకళ్లు కూడా లేవని చేతులెత్తేశారన్నారు. ఒకటిరెండు రోజుల్లో జాతీయ మహిళా కమిషన్‌కు సమగ్రమైన నివేదిక సమర్పించనున్నామని ఖుష్బూ పేర్కొన్నారు.

వన్నియర్ల రిజర్వేషన్‌పై రాష్ట్రవ్యాప్త ఉద్యమం

పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్

పెరంబూర్, జూన్ 27: వన్నియర్లకు రిజర్వేషన్ కల్పించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ తెలిపారు. దిండివనం సమీపం తైలాపురంలోని ఫాం హౌస్‌లో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో వన్నియర్లు వెనకబడి ఉన్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వన్నియర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన డీఎంకే, ప్రస్తుతం వన్నియర్ల రిజర్వేషన్ అమలుకు వెనుకాడుతుందన్నారు. తాను వైద్యుడిగా పనిచేస్తున్న సమయంలోనే వన్నియర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం పీఎంకే పార్టీ బలమైన శక్తిగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వన్నియర్లకు రిజర్వేషన్ కల్పించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు శ్రీకారం చుడతామని డా.రాందాస్ హెచ్చరించారు.

తంజావూరులో భారీ వర్షం

వెయ్యి ఎకరాల్లో మునిగిన పైరు

అడయార్, జూన్ 27: తంజావూరు జిల్లాలో నైరుతి రుతుపవనాల కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆ జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నీట మునిగింది. ప్రస్తుతం ఈ జిల్లాలో దాదాపు 31700 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట చేతికొచ్చిన సమయంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో పంట మునిగిపోతుంది. ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో పంట నీట మునగడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు టీవీకే ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ

- భద్రత కల్పించాలంటూ పోలీసులకు వినతి

పెరంబూర్, జూన్ 27: నటుడు విజయ్ ప్రారంభించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఆధ్వర్యంలో గత విద్యా సంవత్సరం 10, 12 తరగతుల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, ప్రశంసాపత్రం అందించనున్నారు. తిరువాన్మియూర్ సహా మూడు ప్రాంతా ల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలుత తిరువాన్మియూర్‌లో శుక్రవారం జరుగనున్న కార్యక్రమంలో కోవై, మదురై సహా 21 జిల్లాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొననున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగనున్న ఈ కార్యక్రమానికి తగిన బందోబస్తు కల్పించాలని టీవీకే తరఫున తిరువాన్మియూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం వినతిపత్రం సమర్పించినట్లు పార్టీ నిర్వాహకులు తెలిపారు.

బస్సులో మహిళ ప్రసవం

పెరంబూర్, జూన్ 27: కడలూరు జిల్లా దిట్టకుడి నుంచి కోతనూర్‌కు గురువారం ఉదయం ప్రభుత్వ బస్సు బయల్దేరింది. ఆ బస్సులో ఓ గర్భిణి ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్తోంది. మార్గమధ్యంలో హఠాత్తుగా ఆమెకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. గమనించిన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపి, బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలిని ప్రసవం చేయాలని కోరాడు. సహచర మహిళలతో కలసి ప్రసవం చేయగా, ఆ మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. సమయస్ఫూర్తితో వ్యవహరించిన బస్సు డ్రైవర్, కండక్టర్, ప్రసవం చేసిన వృద్ధురాలిని పలువురు అభినందించారు.

పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ ప్రభుత్వం విఫలం

- డీఎంకే ఎంపీ విల్సన్ ధ్వజం



పెరంబూర్, జూన్ 27: నీట్, నెట్, క్యూట్ సహా 12 పరీక్షలు నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పూర్తిగా విఫలమైందని డీఎంకే రాజ్యసభ సభ్యుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.విల్సన్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... 2014 నుంచి 2024 వరకు కేంద్ర ప్రభుత్వం చర్చకు దారితీసిన మూడు వ్యవసాయ చట్టాలు సహా లోక్‌సభలో 427 బిల్లులు, రాజ్యసభలో 365 బిల్లులను నెరవేర్చిందని, విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ఎన్టీఏకు సంబంధించిన చట్టాన్ని కేంద్రం నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు. ఈ ఏజెన్సీ నిర్వహించిన అన్ని పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్నారు. ఇలాంటి అవినీతితో లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. ఎన్టీఏ ఒక సంస్థలా కాకుండా అపార్ట్‌మెంట్స్ సంఘంగా పనిచేయడం దురదృష్టకరమన్నారు. ఎన్టీఏ ప్రభుత్వంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం కావాల్సిందేనా అనే ప్రశ్నకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర పదాన్ సమాధానం చెప్పాలని ఎంపీ విల్సన్ డిమాండ్ చేశారు.

కళ్లకుర్చి బాధితుల 88 మంది డిశ్చార్జ్



ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్న బాధితులు

అడయార్, జూన్ 27: కళ్ళకుర్చి కల్తీసారా ఘటన బాధితుల్లో 88 మంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 18వ తేదీ కళ్ళకుర్చి కరుణాపురం ప్రాంతంలో కల్తీసారా తాగి 229 మంది తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెల్సిందే. వీరిలో 63 మంది మరణించగా, అనేకమంది ఆస్పత్రి పాలయ్యారు. ఈ నేపథ్యంలో 88 మంది గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. వీరిలో కళ్ళకుర్చి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 66 మంది, సేలం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 12 మంది, విల్లుపురం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 2, పుదుచ్చేరి జిప్మర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 6, కళ్ళకుర్చిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 88 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఇదిలావుంటే, ఈ కల్తీసారా ఘటనకు కారకులైన వారిని సీబీసీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో 11 మందిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని సీబీసీఐడీ భావించి కోర్టులో పిటిషన్ వేసింది. ఈ కల్తీసారా కేసులో మాధేష్, గోవిందరాజ్, విజయ, చిన్నదురై, జోసెఫ్ రాజా, కదిరవన్, కన్నన్, శక్తివేల్, శికుమార్, బెన్సిలాల్, గౌతం సహా 11 మందిని విచారించాలని నిర్ణయించిన సీబీసీఐడీ.. వీరిని కస్టడీకి కోరుతూ కళ్ళకుర్చి ప్రధాన క్రైమ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ

- తన చిత్రాలు యువకుడికి పంపిన విద్యార్థిని

పెరంబూర్, జూన్ 27: కరూర్ జిల్లా విజయమంగళం సమీపం వాంజియమ్మన్ ఆలయ వీధికి చెందిన విఘ్నేష్ (27)కు, తారాపురం సమీపంలో ఓ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల ప్లస్ వన్ విద్యార్థినికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఇద్దరు తమ ఫొటోలు పరస్పరం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసుకొనేవారు. క్రమంగా వారి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. విద్యార్థినికి తన ప్రేమలో బంధించిన విఘ్నేష్, అసభ్యంగా ఉంటూ తీసే వీడియోలు పంపించాలని, తాను చూసిన వెంటనే వాటిని డెలిట్ చేస్తానని నమ్మించాడు. అతని ప్రేమలో పడి అతని మాయమాటలు నమ్మిన విద్యార్థిని, తాను నగ్నంగా, అర్ధనగ్నంగా ఉన్న వీడియోలు పంపించింది. కొద్దిరోజుల అనంతరం విఘ్నేష్ ఆ విద్యార్థినికి ఫోన్ చేసి, తాను చెప్పిన ప్రదేశానికి రావాలని, లేకపోతే నీ అసభ్య వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. విఘ్నేష్ వేధింపులకు తట్టుకోలేని ఆమె, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. వారిచ్చిన ఫిర్యాదుతో తారాపురం మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విఘ్నేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

యువతిపై లైంగిక వేధింపులు... సైనికుడి అరెస్టు

పెరంబూర్, జూన్ 27: మాయమాటలు చెప్పి యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడిన సైనికుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మదురై జిల్లా ఉసిలంపట్టికి చెందిన రామన్ (27) జమ్ముకశ్మీర్‌లో సైనికుడిగా పనిచేస్తున్నారు. రామన్‌కు ఉసిలంబట్టికి చెందిన ఓ యువతితో పరిచయం కాగా, వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. దీంతో, ఆ యువతి గర్భం దాల్చింది. ఆ యువతి ఈ విషయాన్ని రామన్‌కు చెప్పగా, అబార్షన్ చేసిన తర్వాత వివాహం చేసుకుందామని నమ్మించాడు. దీంతో ఆమె అబార్షన్ చేయించుకొని రామన్‌ను కలవగా, అతను వివాహం చేసుకొనేందుకు నిరాకరించాడు. దీంతో బాధితురాలు ఉసిలంబట్టి మహిళా పోలీస్‌స్టేషన్‌లో గత జనవరిలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సమన్లు పంపించడంతో రామన్ పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యాడు. అతని వాంగ్మూలం నమోదుచేసిన పోలీసులు, అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లే సమయంలో అతని బంధువులు, బాధితురాలు బంధువులు పరస్పర దాడులకు దిగారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది.

భార్యతో వీడియో కాల్ మాట్లాడుతూ న్యాయవాది ఆత్మహత్య

అడయార్, జూన్ 27: భార్యతో వీడియో కాల్‌లో మాట్లాడుతూ ఓ న్యాయవాది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన స్థానిక అరుంబాక్కంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అరుంబాక్కం రాజాజీ వీధికి చెందిన సతీష్ (28) అనే యువ న్యాయవాదికి మూడు నెలల క్రితం వివాహమైంది. అయితే, భార్యతో మనస్పర్థలు తలెత్తాయి. దీంతో ఆమె కోయంబేడులోని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్య కోసం సతీష్ పరితపిస్తున్నారు. ఆమెకు ప్రతి రోజూ ఫోన్ చేసి ఇంటికి రావాలంటూ ప్రాధేయపడసాగాడు. అయితే, ఆమె ఎంతకీ రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సతీష్... బుధవారం రాత్రి భార్యకు వీడియో కాల్ చేసి, 'నాతో కలిసి జీవించవా... నీవు ఎక్కడున్నా సంతోషంగా ఉండు' అని చెబుతూ ఉరేసుకున్నాడు. ఆ వెంటనే భార్య తన తల్లిదండ్రులతో కలిసి హుటాహుటిన సతీష్ ఇంటికి రాగా అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఆమ్నీ బస్సు బోల్తా... యువకుడి మృతి

- 8 మందికి గాయాలు



బోల్తాపడిన బస్సు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కళియక్కావిళై నుంచి చెన్నైకి బుధవారం రాత్రి ఓ ఆమ్నీ బస్సు బయలుదేరింది. ఆ బస్సును కన్నియాకుమారి ఎస్టీమందారు వావరై ప్రాంతానికి చెందిన అమర్‌నాథ్ (36) నడిపారు. పెరంబలూరు జిల్లా పాటలూరులో ఓ పాఠశాల సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అజిన్‌మోన్ (25) అనే యువకుడు తీవ్రంగా గాయపడి మరణించగా, ఎనిమిదిమంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకుని హుటాహుటిన అక్కడికి చేరుకున్న పాటలూరు పోలీసులు గాయపడినవారిని వెలికి తీసి చికిత్స నిమిత్తం పెరంబలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు చర్యలు చేపట్టి గంట తర్వాత వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

తమిళ లిపి కలిగిన మట్టి కుండ పెంకులు



తవ్వకాల్లో బయల్పడిన కుండ పెంకులు

ఐసిఎఫ్, జూన్ 27: కీళడి పదో విడత తవ్వకాల్లో తమిళ లిపి కలిగిన మట్టి కుండ పెంకులు బయల్పడ్డాయి. ఈ నెల 18వ తేది 13 మంది కార్మికులతో పురావస్తు పరిశోధకులు తవ్వకాలు ప్రారంభించారు. ఇప్పటివరకు 27 వస్తువులు లభ్యం కాగా, ప్రస్తుతం తమిళ లిపి కలిగిన మట్టి కుండ పెంకులు కనుగొన్నారు. ఇదివరకే 5వ విడత తవ్వకాల్లో ఇలాంటి కుండ పెంకులు లభించాయని పరిశోధకులు తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, జూన్ 27: స్థానిక అరుణ్ పారా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో తమిళనాడు ఎంజీఆర్ వైద్య యూనివర్సిటీ వైస్ చాన్సరల్ సలహా మేరకు గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్, మాజీ ఆరోగ్యశాఖ మంత్రి డా.వీఎస్ విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రక్తదానం మహాదానమని, ప్రమాదాల్లో ఉన్న వ్యక్తిని రక్షించేందుకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒకసారి రక్తదాన చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డా.అరుణ్‌కుమార్, డా.కీర్తి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, ఉప ప్రిన్సిపాల్ కలైసెల్వి, నిర్వహణాధికారి సాగర్ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కవిత ఆహ్వానం పలికిన ఈ శిబిరం ఉప ప్రిన్సిపాల్ యువన్ సంగీత వందన సమర్పణతో ముగిసింది. ఈ శిబిరంలో 50 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు రక్తం దానం చేశారు.

విడతల వారీగా మద్యనిషేధం

- కాంగ్రెస్ ఎంపీ తిరునావుక్కరసర్

పెరంబూర్, జూన్ 27: రాష్ట్రంలో విడతల వారీగా మద్యనిషేధం చేపట్టాలని కాంగ్రెస్ ఎంపీ తిరునావుక్కరస్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మైలాడుదురైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కళ్లకుచ్చిలో ఘటనలో 60 మంది మృతిచెందడం ప్రమాదకర విషయమన్నారు. అందువల్లే మృతుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం నష్టపరిహారం అందించిందన్నారు. మృతులు కల్తీసారా తాగిన వారైనా, కుటుంబ జీవనోపాధికి అతనే కారణం కావడంతో ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వానికి మద్యం ద్వారా రూ.45 వేల కోట్ల ఆదాయం వస్తుందని, అదే సమయంలో మద్యనిషేధం అమలుచేయడం ద్వారా రూ.4.50 లక్షల కోట్ల వైద్య ఖర్చులు రాష్ట్రప్రభుత్వానికి ఆదా అవుతోందని, దీనిని పరిగణలోకి తీసుకొని దశల వారీ మద్యనిషేధాన్ని రాష్ట్రప్రభుత్వం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తమకు ఓటు శాతం పెరిగిందని బీజేపీ సంబరపడుతోందని, అందుకు కారణం ఓపీఎస్, టీటీవీ దినకరన్, ఏసీ షణ్ముగం, పీఎంకే పార్టీలతో కూటమి ద్వారా సాధ్యమైందనే విషయాన్ని ఆ పార్టీ నేతలు మరువరాదని తిరునావుక్కసర్ పేర్కొన్నారు.



తిరువళ్లువర్ యూనివర్శిటీ స్నాతకోత్సవానికి హాజరైన రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

జటాయువు మోక్షం పొందిన క్షేత్రం

కంచి విజయరాఘవ పెరుమాళ్ ఆలయం

సుప్రసిద్ధ కాంచీపురంలో అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో 57 వదిగా తిరుపుటకుళి విజయరాఘవ పెరుమాళ్ ఆలయం విరాజిల్లుతోంది. ఈ ఆలయం రావణాసురుడి నుంచి సీతాదేవిని కాపాడే ప్రయత్నంలో అసువులు బాసిన జటాయువు మోక్షం పొందిన పుణ్యక్షేత్రంగా పేరొందింది. సీతాదేవి జాడను తొలిసారిగా తెలిపిన ఆ పక్షిరాజుకు శ్రీరామచంద్రమూర్తి ఊరట కలించారు. తన బాణంతో తవ్విన తీర్థ జలాలతో తన స్వహస్తాలతో జటాయువు అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇక గర్భాలయంలో రెక్కలు తెగిన స్థితిలో ఉన్న జటాయువును వడిలో పెట్టుకుని స్వామివారు దర్శనమిస్తుంటారు. ఈ దివ్యక్షేత్ర విశేషాలను కీర్తిస్తూ తిరుమంగై ఆళ్వారు మంగళాశాసనమొనర్చారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



బ్రహ్మోత్సవాల్లో శ్రీదేవి, భూదేవి సమేత విజయరాఘవ పెరుమాళ్




సూర్యప్రభ వాహనంలో స్వామివారు



శ్రీదేవి భూదేవి సమేత విజయరాఘవ పెరుమాళ్

స్థలపురాణం...

సీతాదేవిని పుష్పకవిమానంలో శ్రీలంకకు తరలిస్తున్న రావణాసురుడితో పోరాడి అసురుడి కత్తి వేటుకు రెక్కలు తెగి ఆ పక్షిరాజు ఈ స్థలంలో పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న జటాయువును శ్రీరామచంద్రమూర్తి చూసి తన వడిలోకి తీసుకుని సేదతీర్చారు. సీతాదేవిని రావణుడు అపహరించుకెళ్లాడని, అతడితో జరిగిన పోరాటంలో గాయపడ్డానని వివరించి ఆ జటాయువు రాముడి వడిలోనే ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత శ్రీరామచంద్రమూర్తి ఆ జటాయువుకు అంత్యక్రియలు నిర్వహించడంతో దానికి మోక్షం ప్రాప్తించింది. జటాయువుకు అంత్యక్రియలు నిర్వహించిన ప్రాంతం కనుక ఈ క్షేత్రానికి తమిళంలో 'తిరుప్పుటకుళి' (జటాయువుకు అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశం) అనే పేరొచ్చింది. జటాయువుకు అంత్యక్రియలు నిర్వహించినప్పుడు చెలరేగిన సెగ, వేడి తట్టుకోలేక కుడివైపున్న శ్రీదేవి తాయార్ ఎడమవైపున, ఎడమవైపున్న భూదేవి కుడివైపు కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తున్నట్లు స్థలపురాణం చెబుతోంది. ఈ కారణంగానే ఆలయంలో పెరుమాళ్‌కు ఎడమవైపు సన్నిధిలో తాయర్ మరకతవల్లి, కుడివైపు సన్నిధిలో అండాళ్ (గోదాదేవి) భక్తులకు దర్శనమిస్తున్నారు.



స్వామివారి నామధేయం : విజయరాఘవ పెరుమాళ్, అమ్మవారి నామధేయం : మరకతవల్లి.
తీర్థం: జటాయు పుష్కరిణి, విమానం : విజయ వీరకోటి విమానం

ఆలయ విశేషాలు..

ఈ ఆలయలో శిలాశాసనాలు ఎక్కువగా ఉన్నాయి. పాండ్యరాజులు, విజయనగర రాజులు ఈ ఆలయానికి అందించిన సేవలు, జీర్ణోద్ధరణ పనులకు అందించిన విరాళాలు తదితర వివరాలతో కూడిన శిలాశాసనాలు కూడా ఉన్నాయి. ఆలయంలోకి ప్రవేశించగానే కుడివైపున చక్రతాళ్వార్లు ప్రత్యేక సన్నిధిలో దర్శనమిస్తారు. మూలవిరాట్టుకు ఎదురుగా మరొక సన్నిధిలో గరుడాళ్వారు కొలువై ఉన్నారు. గర్భాలయం ఎదురుగా ఉన్న మండపంలోని హోమగుండంలో పెరుమాళ్‌సాక్షిగా అన్ని రకాల హోమాలు, యాగాలు జరుగుతాయి. జటాయువు మోక్షం పొందిన ప్రాంతం కనుగక ఆ పక్షిరాజును గౌరవించేలా ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠం ఆలయం వెలుపలే ప్రవేశద్వారానికి ఎదురుగా ఉంటాయి. ఇక ఆలయంలోని అశ్వ విగ్రహం నిజమైన అశ్వంలాగే కదులుతుంది. ఆ గుర్రం శిరస్సు కదిలిస్తే అందుకు అనువుగా తోక అటూ ఇటూ ఊగుతుంది. ఇక గుర్రపు కాళ్లు కదిలేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ అశ్వ విగ్రహాన్ని రూపొందించిన శిల్పి బసచేసిన ప్రాంతాన్ని పెరుమాళ్ ప్రతియేటా బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదోరోజున సందర్శిస్తుంటారు. తై అమావాస్యనాడు తెప్పోత్సవం, మాసి మాసంలో బ్రహ్మోత్సవాలు, ఆవణి నెలలో పవిత్రోత్సవం, నవరాత్రి, కార్తీక దీపోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతాయి. గర్భాలయం ప్రవేశద్వారంపై వందల సంఖ్యలో గంటలున్నాయి. నత్తి తదితర మాటలోపాలు ఉన్నవారు ఆలయంలో స్వామివారిని దర్శించి గంటలు కడితే చక్కగా మాట్లాడే శక్తిని స్వామివారు ప్రసాదిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసంగా ఉంటోంది. కుటుంబ సమస్యలు, దాంపత్య సమస్యలు, ఆస్తి తగాదాలు ఉన్నవారు ఈ ఆలయాన్ని దర్శిస్తే ఆ సమస్యలన్నీ తొలగిపోతాయి.

మొక్కుబడులు...

సంతానం లేనివారు ఈ ఆలయానికి వెళ్ళి జటాయువు తీర్థంలో స్నానమాచరించి వేయించిన పెసలను పొత్తికడుపు వద్ద వస్త్రంలో కట్టుకుని ఆలయంలో ఓ రాత్రి నిద్రిస్తే మరుసటి రోజు ఆ పెసలు నుండి మొలకలు పుడతాయి.అలా పెసలు మొలకెత్తితే వారికి తప్పకుండా సంతానం కలగుతుందని వైష్ణవపండితులు చెబుతారు. పితృదేవతలకు శాంతి కార్యక్రమాలు నిర్వహించలేనివారు ఈ ఆలయంలో చేయవచ్చని చెబుతారు. శ్రీమద్ రామానుజుల వారి గురువైన యాదవప్రకాశ స్వామి ఇక్కడే బసచేశారు. వీరి వద్దే రామానుజలవారు అద్వైత పాఠాలను అభ్యసించారు. రామనుజులవారు చదివిన మండపం కూడా ఇక్కడ ఉంది. రామనుజులు విద్యనభ్యసిస్తున్నట్లు శిల్పం కూడా ఆలయంలో ఉంది.

ఎలా వెళ్ళాలి?

చెన్నై సహా పలు నగరాల నుంచి కాంచీపురానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. కాంచీపురానికి బస్సులో వెళ్ళి అక్కడి నుంచి ఆటో లేదా టాక్సీ కుదుర్చుకుని కాంచీపురం - వేలూరు మార్గంలో 10 కిలోమీటర్ల దూరంలోని బాలుచెట్టి సత్రం చేరాలి. అక్కడి నుంచి కిలోమీటరు దూరం వరకు నడిచి వెళితే ఆలయాన్ని చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 7 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 7 గంటల వరకు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



విజయ వీరకోటి విమానం




జటాయువు తీర్థం



జటాయువు కుడ్యశిల్పం



ఆలయ అంతర మండపం



ఆలయ అంతర ప్రాకారం

'కూలీ' కోసం రజనీ లుక్ టెస్ట్



రజనీ లుక్‌ను ఫొటో తీస్తున్న దర్శకుడు లోకేష్

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో నటించనున్నారు. త్వరలో సెట్స్‌పైకి వెళ్ళనున్న ఈ సినిమాలో రజనీకాంత్ లుక్‌కు సంబంధించి టెస్ట్ చేశారు. ఇందులో రజనీకాంత్ కనిపించనున్న లుక్‌కు సంబంధించి దర్శకుడు లోకేస్ తన ఎక్స్ ఖాతాలో ఓ ఫొటో షేర్ చేశారు. ఇందులో నల్లటి మీసం, తెల్లడి గడ్డంతో విభిన్న లుక్‌లో తలైవర్ కనిపిస్తున్నారు. అలాగే, ఈ సినిమా చిత్రీకరణ జూలైలో ప్రారంభమవుతుంని దర్శకుడు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. కాగా, ఇది రజనీకాంత్ నటించే 171వ చిత్రం. ఇటీవల ఈ సినిమా టైటిల్ వెల్లడిస్తూ ఓ టీజర్ రిలీజ్ చేయగా, అది సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెల్సిందే. సన్ పిక్చర్ బ్యానరుపై ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.



'నేసియప్ప' ఫస్ట్‌లుక్

ఆకాష్ మురళి హీరోగా 'నేసియప్ప'

విష్ణువర్ధన్ దర్శకత్వంలో ఆకాష్ మురళి హీరోగా నటించే చిత్రానికి 'నేసియప్ప' అనే టైటిల్ ఖరారు చేశారు. 'అరిందుమ్ అరియామలుమ్', 'పట్టియల్', 'బిల్లా', 'ఆరంభం' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు విష్ణువర్ధన్... 'షేర్షా' మూవీ ద్వారా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. బాలీవుడ్ బాద్‌షా షారూక్ ఖాన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ నేపథ్యంలో సీనియర్ నటుడు దివంగత మురళి రెండో కుమారుడు ఆకాష్ మురళి హీరోగా కొత్త ప్రాజెక్టు చేపట్టారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జానర్‌లో రూపొందించే ఈ చిత్రంలో శరత్ కుమార్, ప్రభు, ఖుష్బూ, కల్కి కొచ్లిన్, శివ్ పండిట్ తదితరులు నటిస్తున్నారు. 'మాస్టర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాన్ని నిర్మించిన జేవియర్ బ్రిట్టో తన సొంత నిర్మాణ సంస్థ ఎక్స్‌బీ ఫిల్మ్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. చెన్నై, బెంగళూరు, పోర్చుగల్, స్పెయిన్ వంటి ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంది. ఖైసన్ ఛాయాగ్రహణం అందించే ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



పొలిటికల్ చిత్రమే.. కానీ రాజకీయాలు లేవు

● 'అరమ్ సెయ్' చిత్ర దర్శకుడు



ఆడియో రిలీజ్ దృశ్యం

'అరమ్ సెయ్' చిత్రం ఒక పొలిటికల్ చిత్రమే అయినప్పటికీ.. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవని, ఒక మంచి సందేశాత్మక మూవీగా ఉంటుందని ఆ చిత్ర దర్శకుడు బాలు ఎస్.వైద్యనాథన్ తెలిపారు. తార్గై సినిమాస్ బ్యానరుపై ఆయన నిర్మించి దర్శకత్వం వహించిన చిత్రం 'అరమ్ సెయ్'. జీవా, మేఘాలి మీనాక్షి, అంజనా కీర్తి, బయిల్వాన్ రంగనాథన్, తిరుచ్చి సాధన తదితరులు నటించారు. ప్రజల కోసం రాజకీయ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం త్వరలోనే విడుదలకానున్న నేపథ్యంలో బుధవారం రాత్రి ఈ చిత్ర ఆడియో, ట్రైలర్‌ను నగరంలో రిలీజ్ చేశారు. ఇందులో చిత్ర దర్శకుడు బాలు ఎస్.వైద్యనాథన్ మాట్లాడుతూ, 'ఇది ఒక రాజకీయ చిత్రమే కానీ పాలిటిక్స్ గురించి మాట్లాడలేదు. అంజనా కీర్తి తన పాత్రను అద్భుతంగా పోషించారు. ప్రస్తుతం సమాజానికి కావాల్సింది పాలనలో మార్పు కాదు. పూర్తిస్థాయిలో రాజకీయాల్లో మార్పు. ఇదే ఈ సినిమా స్క్రీన్‌ప్లే. దేశంలోని రాజకీయ నేతలు, వ్యక్తులు లేదా, నేటి రాజకీయ పరిస్థితులను లక్ష్యంగా చేసుకోలేదు. 74 యేళ్ళుగా దేశాన్ని పాలిస్తున్న రాజకీయ పార్టీలు ప్రజలపై చేస్తున్న అధికారదర్పమే ఈ చిత్ర కథ. అందుకే ఇది ఒక పొలిటికల్ సినిమా. భారత రాజ్యాంగం ప్రకారం ప్రజాపాలన ఎలా ఉండాలో ఇందులో చెప్పా. సినిమా చూశాక మీడియా సపోర్టు చేయాలి' అని కోరారు. నటుడు జీవా మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం దర్శకుడు బాలు వన్ మ్యాన్ ఆర్మీగా పనిచేశారు. మేఘాలి మంచి ప్రతిభ కలిగిన నటి. అంజనా కీర్తి నటన హైలెట్. దర్శకుడు చివరి వరకు కథ వెల్లడించలేదు. అందుకే ఆయన చెప్పినట్టుగా మేమంతా నటించాం. నటుడు వెట్రి విలన్ పాత్ర పోషించడం సంతోషంగా ఉంది' అన్నారు. అలాగే, హీరోయిన్లు, మిగిలిన యూనిట్ సభ్యులు మాట్లాడారు.

చిత్రజ్యోతి

తనతో పోటీ పడమంటున్న సాక్షి అగర్వాల్

వ్యాయామం చేయడంలో తనతో పోటీపడాలని హీరోయిన్ సాక్షి అగర్వాల్ తన అభిమానులకు పిలుపునిచ్చింది. తాను వ్యాయామం చేస్తుండగా తీసిన ఓ వీడియోను ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేసింది. ఈ వీడియో కింద... 'ఇదే విధంగా మీరు కూడా వ్యాయామం చేసి ఆ వీడియో సోషల్ మీడియాలో షేర్ చేసి నన్ను ట్యాగ్ చేయండి' అంటూ కామెంట్స్ చేయగా ఈ వీడియోను చూసిన ఆమె అభిమానులు పలు రకాల కామెంట్స్ చేస్తున్నారు. కాగా, 'రాజా రాణి' చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన సాక్షి... ఇప్పటివరకు మంచి బ్రేక్ లభించలేదు.'కలా','విశ్వాసం', 'టెడ్డి' వంటి చిత్రాల్లో సహాయ నటిగా నటించి, ఇపుడు హీరోయిన్ స్థాయికి చేరుకుంది.ఈ యేడాది ఆమె నటించిన 'గెస్ట్', 'ది నైట్' చిత్రాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే సాక్షి అగర్వాల్..తన అభిమానులకు మాత్రం సమాజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలంటూ సలహా ఇస్తుంటుంది..

తిరువళ్లువర్ వర్సిటీ 18వ స్నాతకోత్సవం

● విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

వేలూరు, జూన్ 27: స్థానిక సేర్కాడులోని ప్రభుత్వ తిరువళ్లువర్ విశ్వవిద్యాలయం 18వ స్నాతకోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, వర్సిటీ చాన్సలర్ ఆర్ఎన్ రవి అధ్యక్షత వహించగా, జాతీయ సముద్ర సంబంధిత సాంకేతిక పరిజ్ఞాన సంస్థ డైరెక్టర్ రాందాస్ హాజరయ్యారు.. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ఆర్ముగం సహా పలువురు పాల్గొన్నారు. వేడుకల్లో 249 మంది డాక్టరేట్, యూజీ, పీజీ విభాగాల్లో మొదటి మార్కులు పొందిన 325 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాందాస్ మాట్లాడుతూ... దేశంలో ఏడాదికి సుమారు 25 లక్షల మంది డిగ్రీలు పొందుతున్నారని, అదే సమయంలో చైనాలో కోటి మంది విద్యార్థులు డిగ్రీలు పొందుతున్నారని తెలిపారు. నూతన విద్యా విధానంతో విద్యారంగం అభివృద్ధి, విద్యా పరిశోధనలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన మేరకు 'సముద్రయాన్' పథకంలో సముద్రం అడుగున 6 వేల మీటర్ల లోతులో పరిశోధన చేపట్టామన్నారు. దేశం అభివృద్ధి చెందేందుకు విద్యార్థులు, యువత పాత్ర అత్యంత ప్రాముఖ్యమైనదని ఆయన తెలిపారు.

విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి





కార్యక్రమంలో వీఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథన్, అతిథులు, నిర్వాహకులు

వీఐటీ వర్సిటీ, నోకియో 5జీ మధ్య ఒప్పందం

వేలూరు, జూన్ 27: వీఐటీ యూనివర్శిటీ, నోకియో 5జీ సంస్థ మధ్య ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ ఒప్పందంపై కుదిరింది. దీని ద్వారా వీఐటీ వర్సిటీ-నోకియా సంస్థలు ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ లెర్నింగ్, రీసెర్చ్ చేపట్టనున్నాయి. కార్యక్రమంలో వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, వీఐటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం పర్యవేక్షణలో వీఐటీ రిజిస్ట్రార్ డా.జయభారతి, నోకియా బెంగళూరు వర్సిటీ పొన్ని ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో వీఐటీ ఉప చాన్సలర్ వీఎస్ కాంచన, భాస్కరన్, వైస్, ప్రొ చాన్సలర్ పార్థసారధి మల్లిక్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ శాఖ డా.శివానందం, నోకియా ల్యాబ్స్ అధ్యక్షుడు మీనాక్షి, నోకియా వీఐటీ ఆర్గనైజర్ గోవర్ధనన్ తదితరులు పాల్గొన్నారు. ఒప్పందంలో భాగంగా 5జీ అభివృద్ధి సహా పలు అంశాలపై పరిశోధన చేపట్టనున్నారు. ఈ పరిశోధనలకు వీఐటీ విద్యార్థులు, నోకియా శాస్త్రవేత్తలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు వర్శిటీ నిర్వాహకులు తెలిపారు.






పెరుంజాని డ్యామ్‌లో పొంగి ప్రవహిస్తున్న జలాలు - బిల్లూరు డ్యామ్ నుండి విడుదలవుతున్న జలాలు



తేని జిల్లా మూలై వైగైనదిలో జోరుగా ప్రవహిస్తున్న జలాలు

నైరుతి రుతుపవనాల కారణంగా కన్నియాకుమారి, నీలగిరి సహా 6 జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో జలాశయాల్లో నీటిమట్టం పెరిగింది. గత నాలుగు రోజులుగా చెదురుమదురుగా కురిసిన వర్షాలు బుధవారం నుండి కుండపోతగా మారాయి. దీంతో జలాశయాలు, వాగులు, వంకలు నీటితో నిండి పొంగి ప్రవహిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



చిన్నసురుళి జలపాతంలో ఎగసిపడుతున్న జలాలు

'సెయింట్స్ ఆఫ్ భారత్' పుస్తకావిష్కరణ

అడయార్, జూన్ 27: ప్రముఖ రచయిత్రి గీతా గంగాధరన్ రచించిన 'సెయింట్ ఆఫ్ భారత్' పుస్తకావిష్కరణ కార్యక్రమం తాజాగా జరిగింది. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముంబైకు చెందిన శ్రీ బుక్ సెంటర్ ప్రచురించిన ఈ పుస్తకం ఆవిష్కరించారు.. ఇందులో భారతదేశంలోని సాంస్కృతిక, మతపరమైన పునరుజ్జీవనాన్ని పునరుజ్జీవింపజేసి, విశ్వాస సంరక్షకులుగా పనిచేస్తున్నారని వెల్లడించే ప్రయత్నం చేశారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆధ్యాత్మిక ప్రవచనకర్త దుష్యంత్ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత గీతా గంగాధరన్ మాట్లాడుతూ.. ఈ పుస్తకాన్ని ముద్రించి ప్రచురించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలదన్నారు. ఈ పుస్తకం దేశవ్యాప్తంగా ఉన్న 31 మంది సాధువుల కథలను పాన్ ఇండియా కవరేజ్‌గా వివరిస్తుందని ఆమె పేర్కొన్నారు.



పుస్తకావిష్కరణలో ప్రముఖులు